ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం 15 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm

# ఆటోడ్రైవర్ల భిక్షాటన

**రూ. 12 వేల హామీ నెరవేరలేదని ఆగ్రహం**

హైదరాబాద్ : ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12 వేలు ఇస్తామని ప్రభుత్వం హామీనిచ్చిందని నెరవేర్చాలని ఆటో డ్రైవర్లు భిక్షాటన చేసి నిరసన తెలుపుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏడాదికి రూ. 12 వేల హామీ నెరవేరలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రైవేటు ఫైనాన్షియర్లు వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. మూడు రోజులుగా భిక్షటన చేస్తూ నిరసన తెలుపుతున్నారు. చలాన్లతో ట్రాఫిక్ పోలీసులు అధిక వడ్డీలతో ఫైనాన్షియర్లు వేధిస్తున్నారన్నారు.



మహబూబ్ నగర్

# మెడికల్ కాలేజీలో ర్యాగింగ్



## 10 మంది విద్యార్థుల సస్పెండ్

**హాస్టల్ కు వెళ్తున్న జూనియర్లను అడ్డుకొన్న సీనియర్లు**
**డైరెక్టర్ కు ఫిర్యాదు**
**తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్**



మహబూబ్ నగర్ : మహబూబ్నగర్ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం రేపుతోంది. బాధితుల ఫిర్యాదుతో 10 మంది సీనియర్ విద్యార్థులను సస్పెండ్ చేసింది కాలేజీ యాజమాన్యం. జూనియర్ విద్యార్థులను సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేశారు. పాలమూరు మెడికల్ కాలేజీలో హాస్టల్ కు వెళ్లే క్రమంలో జూనియర్లను సీనియర్లు అడ్డగించి ర్యాగింగ్ కు పాల్పడ్డారని డైరెక్టర్ రమేశ్ కు ఫిర్యాదు చేయడంతో పది మందిని సస్పెండ్ చేసినట్లుగా తెలుస్తోంది. ర్యాగింగ్ జరిగిన వెంటనే విద్యార్థులందరూ కూడా మొదట డైరెక్టర్ కు తెలిపారు. పేర్లతో సహా వివరాలు గోప్యంగా ఉంచుతామని ఫిర్యాదు చేయండి అని చెప్పడంతో జూనియర్లు అంతా కలిసి సీనియర్లపై ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. వారి తల్లిదండ్రులను పిలిపించి విద్యార్థుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి ఆ తర్వాత చర్య తీసుకుంటున్నారని తెలిసింది.

## నరేందర్ రెడ్డి పిటిషన్ తిరస్కరణ

**ప్రత్యేక బ్యారక్‌లో ఉంచాలని కోరిన ఆయన తరపున న్యాయవాది**
**తిరస్కరించిన హైకోర్టు రిజిస్ట్రీ**



హైదరాబాద్ : లగచర్ల ఘటనకు సంబంధించి అరెస్టైన పట్నం నరేందర్ రెడ్డిని ప్రత్యేక బ్యారక్‌లో ఉంచాలని హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు ఆయన తరపు న్యాయవాది ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. నరేందర్ రెడ్డిని నేరస్థులతో కూడిన బ్యారక్‌లో ఉంచినట్లు అందులో పేర్కొన్నారు. ఆయనకు స్పెషల్ బ్యారక్ ఇవ్వాలని కోరారు. పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు రిజిస్ట్రీ... దానిని తిరస్కరించింది. అలాగే తనపై కేసును కొట్టివేయాలని కోరుతూ పట్నం నరేందర్ రెడ్డి హైకోర్టులో నిన్న క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. తనకు రిమాండ్ విధిస్తూ కింది కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలని కోరారు. ఈరోజు కోర్టుకు సెలవు కావడంతో ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగే అవకాశముంది.

## డిసెంబర్‌లోగా మిగిలిన రైతులకు.. రుణమాఫీ



**త్వరలో రైతు భరోసా కిస్తీ కూడా చెల్లిస్తాం మంత్రి పొంగులేటి**

హైదరాబాద్ : లగచర్లలో భూములు లేని నిరుపేదలను రెచ్చగొట్టారని మంత్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేతల కుట్రను పోలీసులు వెలికితీస్తారన్నారు. తప్పుచేసినవారిని ప్రభుత్వం వదిలిపెట్టదన్నారు. మిగిలిన రైతులకు డిసెంబర్ లోపు పక్కాగా రుణమాఫీ చేస్తామని అన్నారు. మిగిలిన రూ.13 వేల కోట్లు త్వరలోనే చెల్లిస్తామన్నారు. త్వరలో రైతు భరోసా ఒక కిస్తీ చెల్లిస్తామన్నారు మంత్రి పొంగులేటి .

# కులగణనపై తప్పుడు ప్రచారం

**దేశానికి దిక్సూచి ఈ సర్వే**
**30 శాతం పూర్తి**
**11 నెలల్లో 45 వేల ఉద్యోగాలు ఇచ్చిన కాంగ్రెస్**
**మంత్రి పొన్నం**




హైదరాబాద్ : కుల గణనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సర్వేలో ఎలాంటి బ్యాంక్ వివరాలు అడగడం లేదని తెలిపారు. ఇప్పటికి 30 శాతం సర్వే పూర్తయ్యిందని వెల్లడించారు. దేశానికి దిక్సూచిగా సర్వే నిలబడుతుందని స్పష్టం చేశారు. సర్వేను అడ్డుకుంటే తగిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. మా ప్రభుత్వం 11 నెలల్లో 45 వేల ఉద్యోగాలు ఇచ్చిందని మంత్రి పొన్నం తెలిపారు. కుల గణన సర్వే ఎవరికి వ్యతిరేకం కాదని తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని దోభిఘాట్ గ్రౌండ్‌ను ఆయన పరిశీలించారు. ఇక్కడ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. దోభిఘాట్ గ్రౌండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని చెప్పారు. కులగణన సర్వేలో బ్యాంకు ఖాతా వివరాలు అడగట్లేదని స్పష్టం చేశారు. కులం వివరాలు చెప్పడం ఇష్టం లేకుంటే 999 ఆప్షన్ ఉంటుందని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వేలో ఎలాంటి అపోహలు వద్దన్నారు. రాజకీయ కుట్ర చేసేవారే వీటిని సృష్టిస్తున్నారని చెప్పారు. కులగణన సర్వే వల్ల కొత్త సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టవచ్చని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# రేవంత్ ఓ రాబందు

**వేల ఎకరాలు ఫార్మా కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తున్నారు**
**రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్న ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి**
**ఇవాళ కొడంగల్ .. రేపు తెలంగాణ తిరగబడతదని కేటీఆర్ వ్యాఖ్య**

హైదరాబాద్: కష్టపడి సాధించుకున్న తెలంగాణలో రేవంత్ రాబందులా మారారని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. గతంలో రేవంత్ రెడ్డి ఫార్మా కంపెనీలను విమర్శించారు.. ఇప్పుడు రేవంత్ రెడ్డి ఫార్మా కంపెనీలకు వేలఎకరాలు కావాలంటున్నారని ప్రశ్నించారు. కులగణనలో పాల్గొన్న వ్యక్తిని కూడా అక్రమంగా అరెస్టు చేశారు. వేరేచోట ఐటీఐ చదువుకుంటున్న విద్యార్థిని కూడా అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఆందోళనలో పాల్గొన్నారని కేటీఆర్ సూచించారు. సీఎం అన్న తిరుపతిరెడ్డి రాజ్యాంగేతరశక్తిగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. తిరుపతిరెడ్డి ఫోన్ లో ఆదేశాలిస్తున్నారు.. అధికారులు పాటిస్తున్నారని విమర్శించారు. దాడులు చేస్తూ వీడియోల్లో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలను వదిలేశారని, కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలనే అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



**చేతగానితనం**

చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే రేవంత్ సర్కార్ ప్రయత్నాలు చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. కావాలనే సీఎం ఈ ఘటనకు రాజకీయ రంగు పులిమారు.. తన పదవి ఐదేళ్లే అని రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలని కేటీఆర్ హెచ్చరించారు. కొడంగల్ ను అల్లుడి ఫార్మా కంపెనీకి రాసివ్వాలన్నదే రేవంత్ ప్రయత్నం అన్నారు. ఇవాళ కొడంగల్ తిరగబడ్డది.. రేపు తెలంగాణ తిరగబడతది అని కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు. రేవంత్ రెడ్డీ.. అధికారంలోకి వచ్చాక నిన్నేంచేయాలో మాకు తెలుసన్నారు. కేసులెన్ని పెట్టినా బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడొద్దని కేటీఆర్ ధైర్యం చెప్పారు. ఎకరం రూ. 60 లక్షల భూమిని రూ. 10 లక్షలకు గుంజుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. పేదవాడి కన్నీళ్ల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందన్నారు. రేవంత్ రెడ్డికి చేతనమైతే తమతో కొట్లాడాలి.. అమాయకులతో కాదని సూచించారు.